ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

విజయనగరం

జిల్లా వార్తలు

ఆదివారం 19 జనవరి 2025



20 నుంచి పశు ఆరోగ్య శిబిరాలు: కలెక్టర్

విజయనగరం రింగురోడ్డు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పశువులు ఆరోగ్యంగా ఉండాలని, వాటిలో ఉత్పాదకతను పెంచాలన్న తలంపుతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 20 నుంచి 31 వరకూ పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తుందని, రైతులంతా ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్లో పశు ఆరోగ్య శిబిరాలకు సంబంధించిన పోస్టర్‌ని శనివారం ఆవిష్కరించారు. జేడీ వైవీ రమణ మాట్లాడుతూ, శిబిరాల్లో పశు వైద్య చికిత్సలతో పాటు, గర్భకోశ వ్యాధులకు వైద్యం, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తామన్నారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి

స్ఫూర్తి ప్రదాత ఎన్టీఆర్



క్రమశిక్షణకు మారుపేరు : టీడీపీ సీనియర్ నేత అశోక్‌గజపతిరాజు

విజయనగరం రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ స్ఫూర్తి ప్రదాత అని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు చెప్పారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం విజయనగరం కోట జంక్షన్‌లో వున్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ, ఎన్టీఆర్ సినిమాల్లోనే కాకుండా, రాజకీయాల్లోనూ సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. పేద, మధ్యతరగతి ప్రజలను అన్ని రంగాల్లో పైకి తీసుకువచ్చేలా పథకాలు అమలు చేశారని చెప్పారు. రూ.2 కిలో బియ్యం, జనతా వస్త్రాలు తదితర కార్యక్రమాలు ఎంతో ప్రజాదరణ పొందాయన్నారు. క్రమశిక్షణకు ఎన్టీఆర్ మారుపేరుగా నిలుస్తారన్నారు. తెలుగుజాతి ఉన్నంత వరకూ ఎన్టీఆర్ కీర్తి అజరామరంగా నిలుస్తుందన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, రాజకీయ పార్టీని నెలకొల్పి అతి తక్కువ కాలంలోనే రాజకీయాల్లో మార్పులు తీసుకువచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ, పేదరికం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు అన్న ఎన్టీఆర్ ఎంతో శ్రమించారన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్విని, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మీ, యాదవ, కాళింగ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు ప్రసాదుల ప్రసాద్, అనురాధ, టీడీపీ నాయకులు విజ్జపు ప్రసాద్, కనకల మురళీమోహన్, కంది మురళీనాయుడు, కర్రోతు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

● పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది విద్యార్థులకు రూ.2 వేలు చొప్పున నగదు ప్రతిభా పురస్కారాలను టీడీపీ నాయకులు అందించారు.



అలజంగి వద్ద వేగావతి నదిలో ట్రాక్టరుకు అక్రమంగా ఇసుక లోడు చేస్తున్న దృశ్యం

కలిసిపోయి తవ్వేస్తున్నారు

బొబ్బిలి నియోజకవర్గంలోని కొంతమంది తెలుగు తమ్ముళ్లు.. వైసీపీ నాయకులతో కలిసి అక్రమాలకు తెగబడుతున్నారు. వేగావతి నదిలో ఇసుకను తవ్వుకు పోతున్నారు. రోజుకు 40 నుంచి 50 ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్నారు. ఎవరైనా అడ్డువస్తే బెదిరింపులకు దిగుతున్నారు. అలజంగి గ్రామంలో ప్రతిరోజూ జరుగుతున్న తంతు ఇది. వేకువజామున 3.50 గంటల నుంచి ఆ ఊరిమీదుగా నదిలోకి ట్రాక్టర్లు క్యూ కడుతున్నాయి. వందలాది టన్నుల ఇసుకను తీసుకుపోతున్నాయి. ఇలాంటి అక్రమాల వల్ల కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- వేగావతి నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు
- అధికార, వైసీపీ స్థానిక నాయకుల యవ్వారం
- అలజంగి వద్ద ఊటబావులకు పొంచి ఉన్న ముప్పు
- అధికార యంత్రాంగానికి స్థానికుల ఫిర్యాదులు

విజయనగరం/బొబ్బిలి, జనవరి 18(ఆంధ్రజ్యోతి):

బొబ్బిలి మండలం అలజంగి గ్రామం వద్ద వేగావతి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. దీనిపై స్థానిక అధికారులు ఎవ్వరూ నోరుమెదపడం లేదు. కొందరు అధికార పార్టీ నాయకులు, వైసీపీలో కొంతమంది గ్రామస్థాయి నేతలు, కార్యకర్తలు ఒక్కటై వ్యవహారం నడుపుతున్నారు. వారి ధనదాహానికి సుమారు 50పైగా గ్రామాలకు నీరు అందించే నదిలోని ఇన్‌ఫిల్టర్ బావులు ప్రమాదంలో పడ్డాయి. నదిలో అక్రమంగా ఇసుకను తవ్వుతున్న వారి వద్ద నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని సమాచారం. ఇంత జరుగుతుంటే స్థానిక ప్రజాప్రతినిధికి తెలియకుండా పోతుందా అనే ప్రశ్న ప్రజల్లో ఉత్పన్నమవుతోంది. ఇసుక, మట్టి మాఫియాలపై ఉక్కుపాదం మోపుతామన్న కూటమి ప్రభుత్వం చెబుతున్నా.. అధికారులు చోద్యం చూస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

అనుమతి లేకపోయినా..

ప్రభుత్వ ఇసుక రీచ్ అక్కడ లేకపోయినా అడ్డగోలుగా ఇసుకను తవ్వేసి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఇందుకోసం (మిగతా 8వ పేజీలో..)

ఊటబావి పక్కనే లోతుగా తవ్వేసిన దృశ్యం





పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈవో

నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతం

5381 మంది విద్యార్థుల హాజరు

విజయనగరం కలెక్టరేట్, జనవరి18 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ పరీక్ష కొనసాగింది. విద్యార్థులంతా ఉదయం 9 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా వచ్చారు. జిల్లా వ్యాప్తంగా 32 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 6198 మంది హాజరుకావాల్సి ఉండగా 5381(86.81) మంది మాత్రమే పరీక్ష రాశారు. 817 మంది పరీక్షకు దూరంగా ఉన్నారు. విజయనగరంలో పరీక్ష కేంద్రాలను డీఈవో మాణిక్యంనాయుడు పరిశీలించారు.

అన్నీ పట్టుకెళ్లరు.. ఒకటో, రెండో అంతే!

- తాళాలు ఇంటి బయట పెట్టే వారే టార్గెట్
- పోలీసులకు చిక్కిన ఇద్దరు గజ దొంగలు
- మూడు జిల్లాల్లో 32 ఇళ్లలో దొంగతనం
- రూ.84.5 లక్షల బంగారు ఆభరణాల స్వాధీనం

8 లో



రికవరీ బంగారాన్ని పరిశీలిస్తున్న శ్రీకాకుళం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

ఆ గ్రామానికో చరిత్ర

6 లో



- ఇళ్ల పునాదుల తవ్వకాల్లో బయటపడిన వివిధ మతాల ఆనవాళ్లు
- శ్మశాన వాటిక ప్రదేశంలో రామలింగేశ్వర స్వామి ఆలయం



రోడ్డును ఊడుస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, కమిషనర్ తదితరులు

స్వచ్ఛ ఆంధ్రాకు మేముసైతం

- పెద్ద ఎత్తున కదిలివచ్చిన నేతలు, అధికారులు
- భాగస్వాములైన ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, జేసీ, కమిషనర్

విజయనగరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపుమేరకు శనివారం విజయనగరంలో చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగింది. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు భాగస్వాములయ్యారు. కోట జంక్షన్‌లో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, తూర్పు కాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్విని, కలెక్టర్ అంబేడ్కర్, జాయింట్ కలెక్టర్ సేథు మాధవన్, నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి, డీపీవో వెంకటేశ్వరరావు తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. కొద్దిసేపు రోడ్డును శుభ్రం చేశారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, కరోనా లాంటి చేదు జ్ఞాపకాలను దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యకర సమాజాన్ని సాధించాలన్నారు. కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ, క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అంతటా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కాగా కలెక్టరేట్‌లో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని కలెక్టర్ అంబేడ్కర్ ప్రారంభించి ఉద్యోగులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు.

జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మినీ బస్
- తండ్రీ కూతురు మృతి
- 20 మందికి గాయాలు

ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారంతా కలిసి నేత్ర పరీక్షలు చేయించుకునేందుకు విశాఖ జిల్లా తగరపువలసలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి మినీ బస్సులో శుక్రవారం రాత్రి బయలుదేరారు. బస్సు విజయనగరం జిల్లా పరిధిలోకి వచ్చాక మానాపురం సంతతోట వద్ద కాసేపు ఆగింది. రెండు గంటల పాటు డ్రైవర్ విశ్రాంతి తీసుకున్నాక తిరిగి బయలుదేరింది. ప్రయాణికులంతా మళ్లీ నిద్రలోకి జారుకున్నారు. గజపతినగరం మండలం మదుపాడ గ్రామం దాటిన తరువాత ఒక్కసారిగా బస్సులో భారీ కుదుపు చోటుచేసుకుంది. ఆగి ఉన్న లారీని బస్సు ఢీకొట్టింది. ఆ దాటికి ప్రయాణికులంతా చెల్లాచెదురైపోయారు. గాయాలై ఆర్తనాదాలు చేశారు. ముందుసీటులో కూర్చున్న తండ్రీకూతురు ఉన్నచోటే ఇంజన్‌లో చిక్కుకుని తీవ్రంగా గాయపడి ప్రాణాలు వదిలారు. ఈ ప్రమాదంలో 20 మందికి గాయాలయ్యాయి.

గజపతినగరం, జనవరి18(ఆంధ్రజ్యోతి):

విశాఖ జిల్లా తగరపువలసలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నేత్ర పరీక్షలు చేయించుకొనేందుకు ఒడిశా వాసులు మినీ బస్సులో శుక్రవారం రాత్రి బయలుదేరారు. బస్సు శనివారం వేకువజాము 3 గంటల సమయంలో గజపతినగరం మండలం మదుపాడ గ్రామం దాటుతూ ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా బావనపల్లి గ్రామానికి చెందిన సుబ్రత్ రాయ్(30), కుమార్తె మొహిక్‌రాయ్(3) అక్కడికక్కడే మృతిచెందారు. బస్సు ముందుసీటులో కూర్చోవడంతో ఇద్దరూ తీవ్ర గాయాలతో ప్రాణాలొదిలారు. మరో 20 మంది గాయపడ్డారు. ఘటనలో బస్సు ముందుభాగం నుజ్జునుజ్జయింది. సుబ్రత్‌రాయ్ భార్య మీరారాయ్ వెనుక సీటులో కూర్చున్నారు. ఈమె కూడా గాయపడ్డారు. బస్సులో సుమారు 40మంది వరకు ప్రయాణిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన మహిత, మండక్, బండి మడ్డీ, బరక్ మరిదా, కుసుమహడ్, అంజలి మండల్, లేతా మండల్‌ను 108 వాహనంలో గజపతినగరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన సుభద్రదేవ్, (మిగతా 8వ పేజీలో..)

లారీని ఢీకొట్టిన మినీ బస్





సుభ్రత్‌రాయ్(ఫైల్)



మొహిక్‌రాయ్(ఫైల్)

మరణంలోనూ వీడని బంధం

ఆ తండ్రీకుమార్తె చాలా అన్యోన్యంగా ఉండేవారు. ఇద్దరూ ప్రతిరోజూ ఆడుకునేవారు. ఇటీవల వచ్చిన పుష్ప సినిమాలోని హీరో స్టైల్‌ను చిన్నారి అనుకరిస్తుండగా తీసిన ఫొటో సెల్‌ఫోన్‌లో దాచుకున్నాడు. చిన్నారిని ఆ తండ్రి కంటికిరెప్పలా చూసుకునేవాడు. ఒక్క క్షణం కూడా వదిలేవాడు కాదు. భార్యను కంటి పరీక్షలకు తీసుకొస్తూ బస్సు ముందు సీటులో కుమార్తెతో కలిసి కూర్చొన్నాడు. ఒడిలో పాప నిద్రపోతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. విధి వక్రీకరించి రెప్పపాటులో ఇద్దరూ విగతజీవులయ్యారు.

క్రికెట్ తెచ్చిన వివాదం

7 లో

- ఇరువర్గాల ఘర్షణ
- 22 మందిపై కేసుల నమోదు

పోలమాంబ సన్నిధికి భక్తుల తాకిడి

6 లో

- ఈనెల 27, 28, 29 తేదీల్లో జాతర
- శరవేగంగా ఏర్పాట్లు



ఆకలేస్తుందబ్బా..



అదిగో అక్కడో చేపుంది..



అబ్బో చేపదొరికేసిందోచ్..

హమ్మయ్య.. చేప చిక్కింది!

అనగనగా ఓ కొంగ. నెల్లిమర్ల మండలం రామతీర్థం సమీపంలోని సీతారాములపేట వద్ద గల ఓ చెరువులో ఆహారం కోసం వెదకసాగింది. ఎంతకీ ప్రయత్నం ఫలించలేదు. ఇంతలో కళ్ల ముందరే ఏదో అలికిడి. ఆలస్యం చేయకుండా కిందకు చూసింది. తన కోసమే అక్కడికి వచ్చినట్టు ఓ చేప కనిపించింది. చటుక్కున పట్టుకుంది. గుటుక్కున మింగేసి...అక్కడి నుంచి తుర్రుమంది.

- విజయనగరం, జనవరి 18(ఆంధ్రజ్యోతి)

పోలమాంబ సన్నిధికి భక్తుల తాకిడి



శంబర పోలమాంబను దర్శించుకుంటున్న భక్తులు

మక్కువ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన శంబర పోలమాంబ అమ్మవారి సన్నిధికి శనివారం భక్తుల తాకిడి పెరిగింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శించుకున్నారు. గోముఖి నదీ తీరాన మొక్కులు చెల్లించుకున్నారు. చదురుగుడి, వనంగుడి పరిసరాలు భక్తులతో రద్దీ సంతరించుకున్నాయి.

శరవేగంగా జాతర పనులు

పోలమాంబ జాతర ఈనెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న దృష్ట్యా శరవేగంగా పనులు జరుగుతున్నాయి. చదురు గుడి వెనుక క్యూలైన్లు ఏర్పాటు చేసే ప్రాంతంలో చలువ పందిళ్లు వేసేందుకు సిద్ధం చేశారు. వనం గుడి వద్ద పనులు వేగవంతం అవుతున్నాయి. తాత్కాలిక మరుగుదొడ్లు, కేశఖండన శాల, నిర్మాణాలు ఊపందుకున్నాయి.

భక్తులు ఇబ్బంది పడకూడదు

జాతరకు వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకూడదని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. శనివారం ఆయన జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. చదురుగుడి వెనుక క్యూలైన్ల వద్ద మెట్లు ఏర్పాటు చేయాలని, గోముఖి నది రహదారి మెరుగుపర్చాలని ఆయన అధికారులను ఆదేశించారు. సిరిమాను తిరిగే ప్రాంత రహదారికి ఇరు వైపులా కాలువలపై పలకలు వేయాలన్నారు. ఈ కార్య క్రమంలో ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ, తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, ఎంపీడీవో డీడీ స్వరూపారాణి, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



చలువ పందిళ్లు ఏర్పాటు చేసిన దృశ్యం



బొబ్బిలి: కోటలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు



కురుపాం: నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి



పార్వతీపురం రూరల్: నర్సిపురంలో ఎమ్మెల్యే విజయచంద్ర..



పాలకొండ: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ..

మహనీయుడు ఎన్టీఆర్

- జిల్లా వ్యాప్తంగా వర్ధంతి కార్యక్రమాలు

టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతి శనివారం ఆ పార్టీ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. తెలుగువారి ఆత్మ గౌరవాన్ని కాపాడిన మహనీయుడని ఎన్టీఆర్ అంటూ పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి, పలు కార్యక్రమాలు నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి బృందం



ఎస్.కోట రూరల్: ఎస్‌కోటలో ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



చీపురుపల్లి: ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు, పార్టీ శ్రేణులు



నెల్లిమర్ల: రామతీర్థం జంక్షన్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, సువ్వాడ రవిశేఖర్ తదితరులు



సాలూరు రూరల్: సాలూరులో ఎన్టీఆర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భంజ్‌దేవ్



డెంకాడ: ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి



బొబ్బిలి రూరల్: పక్కి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి..

'ఆదిభట్ల'కు ఘన నివాళి



వెన్‌లాక్ లైబ్రరీ వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు వర్ధంతి కార్యక్రమం శనివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించారు. ప్రభుత్వ సంగీత కళాశాలలో ఉన్న విగ్రహానికి ప్రిన్సిపాల్‌తోపాటు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. వెన్‌లాక్ లైబ్రరీ వద్ద ఉన్న విగ్రహానికి ఆదిభట్ల నారాయణదాసు ఆరాధన సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు, కార్యదర్శులు కాళ్ల నిర్మలాభాగవతారిణి, సూర్యలక్ష్మి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తపేట, బుక్కావీధిలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ ప్రతినిధులతో పాటు దశగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.



త్యాగరాజ ఆరాధనోత్సవాల ర్యాలీలో పాల్గొన్న కళాకారులు

ఘనంగా త్యాగయ్య ఆరాధనోత్సవం

విజయనగరం రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియే షన్, దశగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ సంయుక్తంగా శనివారం కొత్తపేట ఆర్య సోమయాజులు కాశీపతిరావు స్మారక భవనంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలను నిర్వహించాయి. ఈ సందర్భంగా తిరువీధి నిర్వహించారు. మూడు లాంతర్లు నుంచి అంబటి సత్తర్వు జంక్షన్, కొత్తపేట రాధాకృష్ణ జంక్షన్ మీదుగా వేదిక వద్దకు ఈ ప్రదర్శన చేరుకుంది. వేణుగాన విద్వాంసుడు మోడేకుర్తి వెంకట కామేశ్వరరావు త్యాగరాజ ప్రత్యేక వేషధారణలో అలరించారు. అనంతరం వేదిక వద్ద త్యాగరాజ విగ్రహానికి ముంగిపూడి శంకర్ ఆధ్వర్యంలో అభిషేకం, పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచరత్న కృతుల గానం, ప్రసాద వితరణ చేశారు. అనంతరం పి.చిన్న గాత్ర కచేరీ నిర్వహించారు. ఎం.నీలాద్రీరావు వయోలిన్, డాక్టర్ మండపాక రవి మృదంగంతో సహకరించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియషన్ అధ్యక్షులు డాక్టర్ సర్వేశ్వరరావు, డాక్టర్ ఎ.గోపాలరావు, పద్మప్రియ, భాస్కరరావు, సునీత, భానుమతి, పద్మావతి, శారద, సుధాకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆ గ్రామానికో చరిత్ర

- ఇళ్ల పునాదుల తవ్వకాల్లో బయటపడిన వివిధ మతాల ఆనవాళ్లు
- శ్మశాన వాటిక ప్రదేశంలో రామలింగేశ్వర స్వామి ఆలయం
- అదే పేరుతో నిర్మితమైన రామలింగాపురం గ్రామం



రామలింగాపురం గ్రామం

చీపురుపల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ గ్రామం పేరు రామలింగాపురం. అదొక చారిత్రక గురుతుల వనంగా చరిత్రకెక్కింది. గ్రామానికి చెందిన కొంతమంది గృహ నిర్మాణాల కోసం తవ్వకాలు జరిపిన సమయంలో క్రీస్తు శకం రెండో శతాబ్దానికి చెందిన మూడు మతాలకు చెందిన అవశేషాలు లభించాయి. సమాచారం తెలుసుకున్న పురావస్తు శాఖాధికారులు గ్రామంలో తవ్వకాలు జరిపి మరిన్ని ఆనవాళ్లను సేకరించారు. ఈ సమయంలో సువ్వాడ సన్యాసప్పడు పొలంలో కాళ్లు, తల లేని పెరుమాళ్ విగ్రహం బయటపడింది. గ్రామానికి ఉత్తర భాగంలో ఆ కాలంలో విశ్వబ్రాహ్మణులు వినియోగించిన నాటి నిప్పుల కొలిమి ఆనవాళ్లు, విశ్వనాధపురం మార్గంలోని ఇప్పుడున్న రాజులపేట సమీపంలో ఆ కాలం నాటి పగడాలు దొరికాయి. బౌద్ధ, శైవ, వైష్ణవ మతాలకు చెందిన తల లేని విగ్రహాలు బయటపడ్డాయి. అదే విధంగా కొన్ని ఇటుకలు కూడా లభించాయి. తమ గ్రామంలో ఎక్కడ తవ్వకాలు జరిపినా, ఏవో కొన్ని ఆనవాళ్లు బయటపడుతు న్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఒకప్పుడు చూడటానికి పెద్ద దిబ్బలా ఉన్న ఈ ప్రదేశంలో చాళుక్యుల కాలంలో ఈ గ్రామం ఏర్పడిందన్నది గ్రామంలోని వృద్ధుల అభిప్రాయం. అయితే తదనంతర కాలంలో తురుష్కులు జరిపిన దండయాత్ర కారణంగా గ్రామం పూర్తిగా దెబ్బ తిందని, అప్పటి ఆనవాళ్లే ఇప్పుడు లభిస్తున్నాయని తమ పూర్వీకులు చెప్పేవారని గ్రామస్థులు అంటున్నారు.



ఒకప్పుడు కోనేరు ఉండే ప్రాంతం



శ్మశానంలో బయట పడిన పురాతన శిలలు

మరింత లోతైన పరిశోధన జరగాలి

లభిస్తున్న ఆనవాళ్లు, ఇక్కడ లభించిన అవశేషాలను బట్టి తమ గ్రామానికి చరిత్రాత్మక ప్రాముఖ్యత ఉన్నట్టు అర్థమవుతోంది. మరింత లోతైన పరిశోధన జరిపితే కొత్త విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది. ఈ దిశగా సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకోవాలి.

- ఇప్పిలి నీలకంతం, గ్రామ పెద్ద, రామలింగాపురం

శ్మశాన వాటిక ప్రదేశంలో ఆలయం

గ్రామానికి ఈశాన్య దిశలో ప్రస్తుతం శ్మశాన వాటికగా వినియోగిస్తున్న ప్రదేశంలో ఒకప్పుడు రామలింగేశ్వర ఆలయం ఉండేది. ఆలయానికి తూర్పున కోనేరు కూడా ఉండేది. కాలక్రమేణా ఆలయం శిథిలమవ్వగా, కోనేరు పూడుకుపోయి పంట పొలంగా మారింది. ఆ రామలింగేశ్వర ఆలయ పేరుతోనే తమ గ్రామం నిర్మితమయ్యిందన్నది గ్రామస్థుల కథనం. చీపురుపల్లి పట్టణంలో ప్రస్తుతం ఒక వార్డుగా ఉన్న గులివిందాడ అగ్రహారంలో నివాసం ఏర్పరచుకున్న ఆడిదము సూర కవి ఇక్కడున్న కోనేరులో నిత్యం స్నానాదికాలు ముగించి, రామలింగేశ్వర ఆలయంలో పూజలు చేసేవారని, తిరిగి కాపుశంభాం మీదుగా కాలి నడకన గులివిందాడ అగ్రహారం చేరుకొనే వారని గ్రామ పెద్దలు వివరిస్తున్నారు.



తవ్వకాల్లో బయట పడిన గరుత్మంతుడు, పెరుమాళ్ విగ్రహాలు

పేదల పెన్నిధి ఎన్టీ రామారావు



గజపతినగరం:ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు



లక్కవరపుకోట: సీతారాంపురంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన కేబీప రాంప్రసాద్

చీపురుపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు పేదల పాలిట పెన్నిధి అని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్టీఆర్ అడుగు జాడల్లో నడుస్తున్న నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు నారా లోకేష్‌లు రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జనరంజక పాలన సాగిస్తున్నారన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, నాలుగు మండలాల నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, ముల్లు రమణ, జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, తాడ్డి సన్యాసినాయుడు, కోట్ల మోతీలాల్‌నాయుడు, కెంగువ ధనుంజయ, సారేపాక సురేష్, పైల బలరాం, రెడ్డి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

గరివిడిలో...

గరివిడి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గరివిడి మండలంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, నేతలు పైల బలరాం, సారిపాక సురేష్ కుమార్, రెడ్డి గోవింద్, బలగం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశయ సాధనకు కృషి

గజపతినగరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు అన్నారు. శనివారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుజాతి గౌరవాన్ని పెంచిన వ్యక్తి అన్న ఎన్టీఆర్ అన్నారు. చంద్రబాబు ఆయన ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మునాయుడు, బొండపల్లి మాజీ జెడ్పీటీసీ బి.బాలాజీ, ఏఎంసి మాజీ చైర్మన్ చంటిరాజు, ఆసుపత్రి మాజీ చైర్మన్ పి.రమణ తదితరులు పాల్గొన్నారు. మాజీ మంత్రి, జనసేన పీఏసీ సభ్యురాలు పడాల అరుణ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు మునకాలజగన్ తదితరులు పాల్గొన్నారు.

మహోన్నతుడు ఎన్టీఆర్

శృంగవరపుకోట రూరల్/జామి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): యావత్ ప్రపంచం గర్వించదగ్గ మహోన్నతుడు నందమూరి తారకరామరావు అని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శనివారం ఎస్.కోటలో మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. దేవికూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

జామిలో..

మండల కేంద్రమైన జామిలో వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి, పార్టీ కార్యదర్శి రమణ, మండల పార్టీ అధ్యక్షుడు స్వామినాయుడు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

సంక్షేమ పథకాల రూపశిల్పి

నెల్లిమర్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల రూపశిల్పి స్వర్గీయ ఎన్టీఆర్ అని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజు అన్నారు. దివంగత ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు నెల్లిమర్లలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత రామతీర్థం జంక్షన్‌లోని ఎన్టీఆర్‌విగ్రహానికి పూలమాలలు వేసి బంగార్రాజుతో పాటు పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ తెలుగు జాతి కీర్తిని ఢిల్లీ స్థాయికి తీసుకువెళ్లిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. ఈ కార్యక్ర మంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ అట్టాడ శ్రీధర్ (బుజ్జి), నాయకులు ఆల్తి శ్రీనివాసరావు, జమ్ము వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి అవనాపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో యువకులు రక్తదానం చేశారు.

ఎన్టీఆర్ స్థానం చెరగనిది

డెంకాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ స్థానం చెరిగిపోనిదని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. చింతలవలస గ్రామంలో శనివారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు, మండల పార్టీ అధ్యక్షులు పల్లె భాస్కరరావు, పాణిరాజు తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోటలో..

లక్కవరపుకోట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఎల్.కోటలో ఎన్టీఆర్ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీప రాంప్రసాద్ ఆధ్వర్యంలో ఎల్.కోట, సీతారాం పురం కూడలిలో గల ఎన్టీఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. దేశంలో సంక్షేమ పథకాలకు కేరాఫ్ ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, చొక్కాకుల మల్లునాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నేతలు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి

సీతానగరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ట్యాంకర్ లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని సువర్ణముఖి నది వంతెన ముందు శనివారం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. మండలంలోని బల్లకృష్ణరాయపురం గ్రామానికి చెందిన అక్కేన సత్యనారాయణ(53) తామరఖండి రైస్ మిల్లు నుంచి సైకిల్‌పై సీతానగరం మీసేవ సెంటర్‌కు వస్తున్నాడు. సువర్ణముఖి నది వంతెన వద్దకు వచ్చేసరికి బొబ్బిలి వైపు నుంచి వస్తున్న ట్యాంకర్ లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి కుమారుడు, భార్య ఉన్నారు.

క్రికెట్ తెచ్చిన వివాదం

● ఇరువర్గాల ఘర్షణ ● 22 మందిపై కేసులు నమోదు



బాధితులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

దత్తిరాజేరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గదబవలస పంచాయతీ చినచామలాపల్లి గ్రామంలో శనివారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... శుక్రవారం క్రికెట్ ఆడుతుండగా యువకుల మధ్య స్వల్ప ఘర్షణ తలెత్తింది. ఒకరికొకరు అసభ్యకరమైన పదజాలాలు, మెసేజ్‌లు పెట్టడంతో శనివారం ఉదయం పెద్దల మధ్య పంచాయతీ పెట్టారు. అయినప్పటికీ వివాదం సద్దుమణగలేదు సరికదా... మరింత ముదిరింది. ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు కర్రలు, రాళ్లతో దాడి చేసుకున్నారు. దీంతో ఇరువర్గాల వారికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఇరువర్గాలకు చెందిన మన్యాల అప్పలస్వామి, మన్యాల నర్సమ్మ, ఇప్పిలి వెంకటరమణ, పి.దుర్గారావు, డి.శ్రీను, కొయ్యాన సత్యంలకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొయ్యాన సత్యంకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరితోపాటు మరి కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గజపతినగరం సీఐ రమణ గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇరువర్గాల వారు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ మేరకు ఇరువర్గాలకు చెందిన 22 మందిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పెదమానాపురం ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. స్టేషన్ బూర్జవలస ఎస్ఐ జి.రాజేష్, బొండపల్లి ఎస్ఐ మహేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

చెట్టుపై నుంచి జారిపడి గిరిజనుడి మృతి

సీతంపేట రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): చెట్టు పైనుంచి జారిపడి ఓ గిరిజనుడు మృతిచెందాడు. ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎగువ బిల్లగూడ గ్రామానికి చెందిన సవర బుడ్డయ్య(60)అనే గిరిజనుడు శుక్రవారం గ్రామంలోని ములగ చెట్టు ఎక్కి, కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. దీంతో బుడ్డయ్యకు తల, వెన్నెముక భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబసభ్యులు బుడ్డయ్యను 108వాహనంలో సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని రిమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. ఎస్ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. బుడ్డయ్యకు భార్య, పిల్లలు ఉన్నారు.

అసభ్యకర పోస్టులపై ఫిర్యాదు

భోగాపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడంపై పోలిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ శనివారం ఫిర్యాదు చేసినట్లు హెచ్.సి. శ్రీనివాసరావు తెలిపారు. సోషల్ మీడియా, ఫేస్‌బుక్‌లో తనతో పాటు మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజుపై కూడా పోలిపల్లి గ్రామానికి చెందిన మదీనా సాహెబ్ అసభ్యకర పోస్టులు పెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

తోటపల్లి ఎస్ఈగా స్వర్ణ కుమార్

విజయనగరం, కలెక్టరేట్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి పర్యవేక్షణ ఇంజనీరుగా కేవీఎస్ స్వర్ణ కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టుకు కూడా ఆయనే ఎస్ఈగా వ్యవహరిస్తారు. ఇప్పటి వరకూ ఆయన శ్రీకాకుళం జిల్లాలోని వంశధార ప్రాజెక్టు ఎస్ఈగా పని చేశారు. ఈ సందర్భంగా కలెకర్ అంబేడ్కర్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. బొబ్బిలి సర్కిల్ జలవనరులు శాఖ ఎస్ఈగా ఆర్.అప్పారావు నియమితులయ్యారు.

నూతన కార్యవర్గం

రాజాం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంటినరీ కెనెడియన్ బాప్టిస్ట్ చర్చిలో సీబీసీఎన్ఈ 70వ మహా సభలు శనివారం రెండో రోజు ఘనంగా నిర్వహించారు. సుమారు 200 మంది సంఘ పెద్దలు వివిధ బాప్టిస్ట్ సంఘాల నుంచి మహాసభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తర సర్కారుల బాప్టిస్ట్ సంఘం నూతన అధ్యక్షులుగా పి .బోర్డ్ ఎబిజనేజర్‌ను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కె.కృపారావు, ట్రస్ట్ చైర్మన్‌గా హెచ్.ఎస్.ఎస్. పాల్, రికార్డింగ్ సెక్రటరీగా సీహెచ్‌జె ప్రవీణ్, క్రిష్టియన్ ట్రైనింగ్ చైర్మన్‌గా కె.రామారావు, ట్రెజరర్‌గా జె.ఎస్.ప్రేమ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎల్.చిట్టిబాబు. కె .దేవదత్తం. ఎల్.రవికుమార్ పాల్గొన్నారు.

నేడు జీవిత బీమా జాతీయీకరణ దినోత్సవం

రాజాం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో జీవిత బీమా జాతీయీకరణ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్టు ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.ప్రభాకర్‌రావు, కార్యదర్శి జితేంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ఎల్ఐసీ మనుగడకు ప్రమాదం కలిగించేలా ఉన్నాయన్నారు. ఈ చర్యలు ప్రజల నమ్మకానికి విఘాతం కలిగిస్తాయన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

రేగిడి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సైబర్‌క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలని రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర పిలుపునిచ్చారు. లచ్చరాయపురంలో శనివారం సైబర్ క్రైమ్, డ్రగ్స్ నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే పక్కాగా ఉండాలి

రేగిడి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కుష్టువ్యాధిపై నిర్వహిస్తున్న సర్వే పక్కాగా ఉండాలని ఎంపీడీఓ శ్యామలాకుమారి, వైద్యాధికారులు అసిరినాయుడు, సోహిని స్పష్టం చేశారు. రేగిడి పీహెచ్‌సీలో శనివారం కుష్టు వ్యాధి నియంత్రణపై నిర్వహిస్తున్న సర్వేపై సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుందరేశ్వరరావు పాల్గొన్నారు.

బాల అన్నమ్మ ఉత్సవాలు ప్రారంభం



ముర్రాటలతో భక్తులు

సంతకవిటి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సురవరం గ్రామంలో శ్రీబాల అన్నమ్మ పేరంటాలు జాతర మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారి తిరువీధులు నిర్వహించారు. వందలాది మంది భక్తులు ముర్రాటలు, పసుపు, కుంకుమలతో మొక్కులు తీర్చుకున్నారు. ఈ నెల 20 వరకు కొనసాగే ఉత్సవాల్లో అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక సౌకర్యాలు కల్పించామని కమిటీ సభ్యులు తెలిపారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి: ఎమ్మెల్యే కళా

చీపురుపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతులు, పెంపకందారులు తమ పశు సంపద ఆరోగ్యంపై తగిన శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే కళా వెంకటరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన పశు ఆరోగ్య శిబిరాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు బాగుండాలన్న లక్ష్యంతో పశు వైద్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోం దని తెలిపారు. ఈ నెల 20 నుంచి నెలాఖరు వరకూ జరగనున్న పశు వైద్య శిబిరాలను రైతులు, పశువుల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కళా సూచించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఏడీ డా. శారద, ఎంపీడీఓ ఇ.సురేష్, తహశీల్దారు ఎస్.రాజారావు, పార్టీ నాయకులు కుచ్చర్లపాటి త్రిమూర్తుల రాజు, కాము నాయుడు, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత.. అందరి బాధ్యత

విజయనగరం రింగురోడ్డు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత అందరి బాధ్యతని... ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెకర్ మురళీకృష్ణ అన్నారు. శనివారం ఆర్టీసీ కాంప్లెక్స్ గ్యారేజ్‌లో రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ వాహనం నడిపే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సూరిదేముడు, ప్రజారవాణాధికారి అప్పలనారాయణ, డిపో మేనేజర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి సర్కారు కృషి అభినందనీయం

విజయనగరం దాసన్నపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణం ఉక్కు కర్మాగారం పరిరక్షణకు కేంద్ర మంత్రులు హెచ్‌డీ కుమారస్వామి, కింజరాపు రామ్మోహన్‌నాయుడు, భూపతిరాజు శ్రీనివాస వర్మ చేసిన కృషి అభినందనీయమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ కొనియాడారు. శనివారం ఆర్ అండ్ బీ సమీపంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీ రూ.11,440 కోట్ల ప్యాకేజీని ప్రకటించడం, ప్రైవేటీకరణ ప్రసక్తే లేదని చెప్పడంపై హర్షం వ్యక్తం చేశారు. మున్ముందు ఉక్కు అభివృద్ధికి మరింత తోడ్పాటును అందించాలని ఆయన కోరారు.

ఆస్తిపన్నును సకాలంలో చెల్లించాలి

విజయనగరం రింగురోడ్డు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థకు బకాయి పడిన ఆస్తి, ఖాళీ స్థలం పన్నులు, నీటి ఛార్జీలు మార్చి నెల 31లోగా చెల్లించాలని కమిషనర్ పి.నల్లనయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. బకాయిలు చెల్లించకపోతే ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లను తొలగిస్తామని ఆయన హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పన్నులు సకాలంలో చెల్లించాలని కోరారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం



వినతిపత్రాలు స్వీకరిస్తున్న చైర్మన్, సభ్యులు

రాజాం రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఈపీడీసీఎల్ సంస్థ పరిధిలోని ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల్లోని వినియోగదారులకు విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఎదురయ్యే సేవా లోపాలను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యమని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక న్యాయస్థానం చైర్మన్ డా.బి.సత్యనారాయణ స్పష్టం చేశారు. రాజాంలోని ట్రాన్స్‌కో సబ్ డివిజనల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వినియోగదారులు బిల్లింగ్, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, ఏర్పాటులో సిబ్బంది జాప్యం, మీటర్లు కాలిపోవడం, ఓల్టేజిలో హెచ్చుతగ్గులు, కొత్త సర్వీసుల ఏర్పాటులో జాప్యం, అదనపు లోడ్ మంజూరు, సాంకేతిక సమస్యలు, బిల్లుల్లో లోపాల సవరణ, విద్యుత్ బిల్లుల చెల్లింపు తరువాత మీటర్ రీ-కనెక్షన్ తదితర అంశాలపై ఫిర్యాదు చేయవచ్చని ఆయన స్పష్టం చేశారు. వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా, పోస్టల్, ఆన్‌లైన్ ద్వారా న్యాయస్థానంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. తొలుత తమ సమస్యలపై సమీప ట్రాన్స్‌కో అధికారికి ఫిర్యాదు చేయాలని, సకాలంలో సమస్యలు పరిష్కారం కాకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని డా.సత్యనారాయణ సూచించారు. ఈ సదస్సులో పలువురు వినియోగదారులు తమ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో సభ్యులు షేక్ బాబర్, మసిలామణి, మురళీకృష్ణ, ఏడీఈ బీవీఎస్‌పీ కుమార్, ఏఈ ఓజేసీ కుమార్, రేగిడి, వంగర ఏఈలు పాల్గొన్నారు.

రహదారి పక్కన పొదల తొలగింపు

సంతకవిటి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి); ప్రమాదాల నివారణకు సంతకవిటి పోలీసులు శనివారం చర్యలు చేపట్టారు. సంతకవిటి-రాజాం రోడ్డు పక్కన, వివిధ గ్రామాల మలుపుల్లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఆర్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే 'స్వచ్ఛ ఆంధ్ర' సాధ్యం



నెల్లిమర్ల: రామతీర్థంలో పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న బంగార్రాజు, రవిశేఖర్ తదితరులు



డెంకాడ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

నెల్లిమర్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరు సహకరించాలని, అందరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛఆంధ్ర సాధ్యమని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజు కోరారు. మండల కేంద్రం నెల్లిమర్ల, రామతీర్థంలో 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంతో పాటు ర్యాలీలో పాల్గొన్నారు. రామతీర్థంలో రోడ్లు పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగ్గా ఉన్నప్పుడే ప్రజల ఆరోగ్యం బాగుంటుందని అన్నారు. ఈ సందర్భంగా నెల్లిమర్లలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్, నాయకులు లెంక అప్పలనాయుడు, అట్టాడ శ్రీధర్, రెడ్డి వేణు, ఆల్తి శ్రీనివాసరావు, కోటపాటి తిరుపతిరావు, బయిరెడ్డి కల్యాణ్ చక్రవర్తి, కమిషనర్ కె.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, ఈఓపీఆర్‌డీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ ధ్యేయంగా పనిచేద్దాం

డెంకాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి పల్లెను స్వచ్ఛంగా, పరిశుభ్రంగా ఉంచడమే ధ్యేయంగా పని చేద్దామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. శనివారం పినతాడివాడ గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముందుగా వీధుల్లో పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం గ్రామ మహిళలకు పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తూ.. ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఎంపీపీ బి.వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు, మండల పార్టీ అధ్యక్షులు పల్లె భాస్కరరావు, పాణిరాజు, బీజేపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి బూర్లె శ్రీధర్, జనసేన నాయకులు చనుమల్లు వెంకటరమణ, సర్పంచ్ లంక లక్ష్మణరావు, ఎంపీడీఓ భవాని, తహసీల్దారు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

విజయనగరం రింగురోడ్డు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత కూడా ప్రతి ఒక్కరూ పాటించాలని నగర పాలక సంస్థ కమిసనర్ పి. నల్లనయ్య అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని నగరంలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈటీ రాయల్‌బాబు, ప్రజారోగ్య అధికారి డాకర్ కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు. విజయనగరం ఏపీఎస్ ఆర్టీసీ సిబ్బంది ఆధ్వర్యంలోనూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజరు జె.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు డి.ఆదినారాయణ, ఎంఎల్‌కె రాజు, యూనియన్ ప్రతినిధులు, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం రింగురోడ్డు: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్ నల్లనయ్య తదితరులు

పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలి

- ప్రజాప్రతినిధులు, అధికారుల పిలుపు
- స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ ప్రారంభం

ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలని ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. మానవహారంగా ఏర్పడ్డారు. రహదారులపై చెత్తను తొలగించా రు. పరిసరాల పరిశుభ్రతలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


పార్వతీపురంటౌన్: చెత్తబండిని తోస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర



గుమ్మలక్ష్మీపురం: స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి


బాడంగి: భీమవరంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో సత్యనారాయణ



పాలకొండ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ


బొబ్బిలి: గాంధీబొమ్మ జంక్షన్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న బుడా చైర్మన్ తెంటు


సాలూరు రూరల్: మామిడిపల్లిలో ర్యాలీ చేస్తున్న డీపీవో కొండలరావు


పార్వతీపురం రూరల్: బందలుప్పి పీహెచ్‌సీ ప్రాంగణంలో శుభ్రం చేస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

కలిసిపోయి తవ్వేస్తున్నారు

(5వ పేజీ తరువాయి)

కొన్ని గ్రామాల్లో ఏకంగా బహిరంగ వేలాలు నిర్వహించుకుని మరీ అక్రమాలకు పాల్పడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉచిత ఇసుక పథకాన్ని విజయవంతంగా అమలు చేయాలని అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు, మార్గదర్శకాలు ఇచ్చినప్పటికీ ఇసుకాసురులు అక్రమ సంపాదన యావతో తమవైన విధానాలను అమలు చేసుకుంటున్నారు. ఎడ్లబళ్లతో ఇసుకను రవాణా చేసేవారికి సీఎం చంద్రబాబు వెసులుబాటుకల్పించిన సంగతి తెలిసిందే. దీనిని ఆసరాగా చేసుకొని కొంతమంది అక్రమార్కులు నాటుబళ్లతో ఇసుకను రవాణా చేసి ఓ చోట గుట్టలుగా పోగేసి అక్కడ నుంచి అక్రమంగా లారీలు, ట్రాక్టర్‌లతో రవాణా చేస్తున్నారు.

- బొబ్బిలి మండలం అలజంగి, బాడంగి మండలం పాల్తేరు గ్రామాల్లో వేగావతి నదిలో ఈ అక్రమ దందా జోరుగా సాగుతోంది. దీనిపై కలత చెందిన కొందరు రైతులు ప్రభుత్వ ఉన్నతాధికారులకు, పోలీసు అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేశారు.
- ఇసుక అక్రమ రవాణాకు ఎవరైనా అడ్డు చెప్పినా, అభ్యంతరం వ్యక్తం చేసినా మాఫియా తన తడాఖా చూపిస్తున్నట్లు ఆరోపణలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి.
- వేగావతి నది సమీపంలో జిరాయితీ భూములు కలిగిన రైతులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. పంట భూములు, తోటలు సాగుకోసం ఏర్పాటు చేసుకున్న బోరు బావులు ఎండిపోతున్నాయని గగ్గోలు పెడుతున్నారు.
- బాడంగి, దత్తిరాజేరు మండలాలకు చెందిన 58 గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు పాల్తేరు సమీపంలో ఆర్‌డబ్ల్యుఎస్ తాగునీటిపథకం ఏర్పాటు చేశారు. రానున్న వేసవి కాలంలో ఇసుక మాఫియా కార్యకలాపాల ప్రభావంతో తాగునీటి సరఫరాకు ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బొబ్బిలి మండలం పెంట తదితర గ్రామాల్లో ఇసుక అక్రమ తవ్వకాల కారణంగా తమ పంటలు ఎండిపోతున్నాయని రైతులు రెవెన్యూ కార్యాలయాల్లో ఫిర్యాదులు చేయడం, ఆందోళనలు చేసిన ఘటనలు గతంలో ఉన్నాయి.

నీటి వనరులకు ముప్పు

ఇసుక మాఫియా కారణంగా తాగు, సాగునీటి వనరులకు పెనుముప్పు కలుగుతుంది. రైతుల్లో చాలా ఆందోళన నెలకొంది. నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ ఇసుక దోపిడీ జరుగుతోంది. ఇసుక రీచ్ లేనప్పుడు ఇక్కడ నుంచి ఇసుకను ఎలా తవ్వుతారు. గత ఏడాది బోర్లు ఎండిపోయి రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఈ వేసవిలో కూడా అలాంటి ప్రమాదం మళ్లీ రాకుండా నీటి వనరులను రక్షించుకోవాలి. ఈ ప్రాంత రైతులంతా కలిసి ప్రభుత్వ యంత్రాంగానికి లిఖితపూర్వక ఫిర్యాదు చేశాము. నాటు బళ్లను బూచిగా చూపి ఇసుక మాఫియా అక్రమాలకు పాల్పడుతోంది. స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన చాలా మంచి ప్రజాప్రతినిధి. ఆయన ఇసుకాసురులను గట్టిగా హెచ్చరించారు. ఆయన హెచ్చరికలను బేఖాతరు చేస్తూ అక్రమాలకు పాల్పడడం తగదు.

- చిలుకూరి వెంకటనారాయణరావు, పామాయిల్ రైతు, అలజంగి

జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

(5వ పేజీ తరువాయి)

అంజలిరాయ్, శ్యామలాదేవి, పార్వతీబుద్ధో, సుమిత బల్లా, సమిత్రా రాయ్, అమీబాబు, జస్వింత్ మండల్, ప్రదీప్‌కుమార్ మండల్, సతీహం దక్, జ్యోష్న మండల్, మరమాత్ హల్దర్ విజయనగరం జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం కొందరు కంటి ఆస్పత్రికి వెళ్లారు. ఘటనలో బస్సు డ్రైవర్ ఒమ్మి సత్తిబాబుకు కాలు విరిగిపోయింది. సీఐ ఏవీ రమణ ఘటనా స్థలిని పరిశీలించారు. పెదమానాపురం, గజపతినగరం, బొండపల్లి ఎస్‌ఐలు, సిబ్బంది బాధితులకు సహకారం అందించారు. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా బస్సు, లారీని వేరు చేశారు.

పనితీరు మెరుగు పరచుకోవాలి: డీఎంహెచ్‌వో

బొండపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్య సిబ్బంది తమ పనితీరును మరింతగా మెరుగుపరచుకోవాలని డీఎంహెచ్‌వో జీవనరాణి సూచించారు. స్థానిక పీహెచ్‌సీని ఆమె శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందులు, వ్యాక్సిన్లు ఏ విధంగా నిల్వ చేస్తున్నారు? ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు పీహెచ్‌సీల్లో అన్ని రకాలైన సేవలను పూర్తి స్థాయిలో అందించాలన్నారు. అత్యవసర పరిస్థితిలో మాత్రమే ఏరియా ఆసుపత్రికి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మందుల కొరత రాకుండా చూసుకోవాలని సూచించారు. ఆశా కార్యకర్తలు, సచివాలయ ఏఎన్‌ఎంల పనితీరును పరిశీలించాలని వైద్యులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఎల్.సత్యనారాయణ, సమీర, హెల్త్ సూపర్‌వైజర్ సూరి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలులో న్యాయ అవగాహన సదస్సు

బొబ్బిలి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి సబ్ జైలులో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్‌పర్సన్, సీనియర్ సివిల్ న్యాయాధికారిణి ఎస్.అరుణశ్రీ ఆధ్వర్యంలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. చట్టప్రకారం వారికి గల హక్కులను వివరించారు. సత్ప్రవర్తనతో మెలగాలని హితవు పలికారు. తొలుత జైలు పరిసరాలను పరిశీలించారు. ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కొనసాగుతున్న నియామక ప్రక్రియ

విజయనగరం క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల నియామకాలకు సంబంధించి దేహదారుఢ్య పరీక్షల ప్రక్రియ కొనసాగుతోందని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. పీఎంటీ, పీఈటీ పరీక్షలకు 600 మంది పురుష అభ్యర్థులు శనివారం హాజరుకావలసి ఉండగా... 517 మంది హాజరయ్యారన్నారు. వారిలో 370 మంది అభ్యర్థులు తుది రాత పరీక్షకు అర్హత సాధించారని తెలిపారు. అభ్యర్థుల హాల్‌టికెట్‌ను పరిశీలించి పోలీసు పరేడ్ గ్రౌండ్‌లోకి అనుమతించామన్నారు. విద్యార్హతలు, రిజర్వేషన్లు, వయస్సు నిర్ధారించే ధ్రువపత్రాలను పరిశీలించి.. అన్నీ సక్రమంగా ఉన్న అభ్యర్థులను మాత్రమే పీఎంటీ పరీక్షకు అనుమతించామని తెలిపారు. ఏఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు వీరకుమార్, యూనివర్స్, రమణమూర్తి, ఎస్.బాపూజీ, సీఐ శ్రీనివాసరావు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్ధంతి

కురుపాం, జనవరి18(ఆంధ్రజ్యోతి): దివంగత నేత, టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక గాంధీనగర్ సెంటనర్ గల ఆయన విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. రాష్ట్ర తెలుగు యువత అధికారి ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. ● పాలకొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మరణం లేని జననం ఎన్టీఆర్‌దని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. శనివారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని కోటదుర్గమ్మ ఆలయం దరిలో ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాప్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● పార్వతీపురం రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నర్సిపురం గ్రామంలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. టీడీపీ నాయకుడు గొట్టాపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ● బెలగాం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శనివారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆసుపత్రిని తనిఖీ చేసి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ పార్వతీపురం మండల అధ్యక్షుడు బోను చంద్రమౌళి, టీడీపీ నాయకుడు మజ్జి వెంకటేష్ పాల్గొన్నారు. ● పాలకొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురంలో అరకు పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు వారాడ సుమంత్‌నాయుడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు.

● బొబ్బిలి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం బొబ్బిలిలోని ఆయన విగ్రహానికి బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు పూలమాల వేసి, నివాళులు అర్పించారు. అనంతరం బొబ్బిలి కోటలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. టీడీపీ నాయకులు రాంబార్కి శరత్‌బాబు, వాసిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే..

బొబ్బిలి రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం పక్కి గ్రామంలోని ఆయన విగ్రహానికి వైసీపీ మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

బొబ్బిలి ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈగా అప్పారావు

బొబ్బిలి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీరుగా ఆర్.అప్పారావును నియమించారు. ధవళేశ్వరంలో ఈఈగా పనిచేస్తున్న అప్పారావు పదోన్నతిపై బొబ్బిలి సర్కిల్‌కు రానున్నారు. ఇక్కడ ఎస్ఈగా పనిచేసిన వైవీ రాజేశ్వరికి ఆరు నెలల కిందటే విజయవాడకు బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఇంతవరకు శంబంగి సుగుణాకరరావు ఇన్‌చార్జి ఎస్ఈగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 43 మంది ఇంజినీరింగ్ అధికారులకు పోస్టింగులను కల్పిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రకారం బొబ్బిలి ఎస్‌గా అప్పారావు నియమితులయ్యారు. ఈయన గతంలో బొబ్బిలి సర్కిల్ కార్యాలయంలో డీఎస్ఈగా పనిచేశారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

విజయనగరం కలెక్టరేట్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి వేతనాలు, పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ మధ్యా హ్న భోజన పథక నిర్వాహకులు శనివా రం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ కనీస వేతనం రూ.10 వేలు అందజేయాలని కోరారు. రాజకీయ వేధింపులు అరికట్టాలని, మెనూ చార్జీలు ప్రాథమిక పాఠశాల పిల్లలకు రూ.15, హైస్కూల్ విద్యార్థులకు రూ.25 చొప్పున పెంచాలని డిమాండ్ చేశారు. గ్యాస్, వంట సరుకులు ప్రభు త్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు డేగల అప్పలరాజు, రామలక్ష్మి, పురం అప్పారావు పాల్గొన్నారు.

అన్నీ పట్టుకెళ్లరు.. ఒకటో, రెండో అంతే!

- తాళాలు ఇంటి బయట పెట్టే వారే టార్గెట్
- పోలీసులకు చిక్కిన ఇద్దరు గజ దొంగలు
- మూడు జిల్లాల్లో 32 ఇళ్లలో దొంగతనం
- రూ.84.5 లక్షల బంగారు ఆభరణాల స్వాధీనం

అనగనగనగా ఇద్దరు దొంగలు.. ముందుగా రెక్కీ నిర్వహిస్తారు. పనిమీద వెళ్తూ తాళాలు ఇంటి బయట పెట్టే వారిని గమనిస్తారు. అలాంటి ఇళ్లనే తమ టార్గెట్‌గా చేసుకుంటారు. తాళాలు తీసి లోపలకు వెళ్తారు. బీరువాలన్నీ సోదా చేస్తారు. నగలు కనిపిస్తే అన్నీ ఎత్తుకెళ్లరు. ఒకటో, రెండో తీసుకుని మిగతావన్నీ అక్కడే పెట్టేసి వెళ్తారు. ఇలాంటి విచిత్రమైన దొంగలను జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా మూడు జిల్లాల్లో 32 చోట్ల, రాష్ట్రంలో 30చోట్ల వీరు చోరీలకు పాల్పడ్డారు.


వివరాలు వెల్లడిస్తున్న శ్రీకాకుళం ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఇద్దరు గజ దొంగలను జిల్లా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.84.44 లక్షల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఈ వివరాలు వెల్లడించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం పత్తికాయలవలసకు చెందిన పున్నాన రాంబాబు.. విజయవాడలోని తన అత్త ఇంట్లో ఉంటూ ఇంటర్మీడియట్ చదివాడు. అక్కడే క్రికెట్ కోచింగ్ తీసుకున్నాడు. కాగా.. రంజీకి ఎంపిక కాకపోవడంతో చెడువ్యసనాలకు బానిసై నేరాలకు పాల్పడుతుండే వాడు. ఈ క్రమంలో విజయవాడ, గుంటూరు, ఎస్.కోట, రాజాం, విజయనగరం, చీపురుపల్లి, రణస్థలం, లావేరుతోపాటు రాష్ట్రంలో పలు పోలీసుస్టేషన్ల పరిధిలో 30కిపైగా కేసుల్లో జైలుకు వెళ్లాడు. 2022 జూన్‌లో అరెస్ట్ అయి 2024 జనవరి 10న విశాఖపట్నం సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యాడు. జైలులో రాంబాబుకి.. జి.సిగడాం మండలం గెడ్డ కంచరాం గ్రామానికి చెందిన గిడిజాల కోటేశ్వరరావుతో పరిచయం ఏర్పడింది. వారిద్దరూ కలిసి జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా చోరీలకు పాల్పడేవారు. ఏడాది కాలంలో మూడు జిల్లాల్లో 32 ఇళ్లల్లో చోరీలు చేశారు. ఎచ్చెర్ల పోలీసుస్టేషన్ పరిధిలో 2024లో 2, 2025లో 9, లావేరులో 3, శ్రీకాకుళం ఒన్‌టౌన్ పరిధిలో 4, రూరల్ పరిధిలో 2, గారలో 2, టూటౌన్‌లో 4, పొందూరులో 3, పోలాకిలో 1, విశాఖ సిటీ పీఎం పాలెంలో 2 చోట్ల ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. మొత్తం 1కేజీ 305 గ్రాములు(112 తులాల) బంగారు ఆభరణాలను దొంగిలించారు.

ఎచ్చెర్ల బాధితుల ఫిర్యాదుతో..

ఈ నెల 7న ఎచ్చెర్ల పరిధిలో ఓ ఇంట్లో ఐదున్నర తులాల బంగారు కాసులపేరు(హారం), ఒక తులం బంగారు చైన్ పోయినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఈ నెల 17న ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలస కూడలిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న రాంబాబు, కోటేశ్వరరావును పోలీసులు పట్టుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. మూడు జిల్లాల్లో 32 చోట్ల దొంగతనాలకు పాల్పడినట్లు వారిద్దరూ వద్ద అంగీకరించారు. పోలీసులు వారిని అరెస్టు చేసి.. వారి నుంచి రూ.84,44,800 విలువ చేసే 1కేజీ 206.4 గ్రాముల బంగారు ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. ఇంకా మరో 250 గ్రాముల బంగారు ఆభరణాలు బ్యాంకులో తాకట్టులో ఉన్నాయని, వాటిని కూడా స్వాధీనం చేసుకుంటామని ఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు.

ముందుగా రెక్కీ..

తాళాలు బయటపెట్టేవారి ఇళ్లే లక్ష్యంగా.. రాంబాబు, కోటేశ్వరరావు దొంగతనాలకు పాల్పడేవారు. ఇళ్లను రెక్కీ చేసేవారు. ఇంట్లో ఉన్న వ్యక్తులు బయటకు వెళ్లేముందు ఇంటికి తాళం వేసి.. వాటిని ఎక్కడ పెట్టేవారో గమనించేవారు. కొంతమంది చెప్పుల స్టాండ్‌లో, మరికొందరు కిటికీల వద్ద, కరెంట్ మీటరు వద్ద తాళాలు పెట్టినట్టు గుర్తించేవారు. వారు బయటకు వెళ్లగానే ఆ తాళం తీసుకుని నేరుగా ఇంట్లోకి వెళ్లి.. బీరువా తెరిచి అందులో ఉన్న ఒకటో, రెండో ఆభరణాలను దొంగిలించేవారు. మళ్లీ యథావిధిగా తాళాలు ఆ చోట పెట్టేసి వెళ్లిపోయేవారు. ఇలా దొంగిలించిన బంగారాన్ని తెలిసిన వాళ్ల ద్వారా ముత్తూట్, ఫిన్‌కాప్ తదితర ఫైనాన్స్ సంస్థల్లో తనఖా పెట్టి డబ్బులు తీసుకుని జల్సాలు చేసేవారు. వీరు దొంగతనం చేసిన వారి ఇంట్లో ఇప్పటికీ చాలా మందికి చోరీ జరిగినట్టు తెలియదని.. ఇంట్లో వారే వస్తువులు ఎక్కడో పడేశారని అనుకుంటారని.. అదే ఈ దొంగల మోటివ్ అని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తెలిపారు. దీంతో దొంగతనం ఘటనలపై ఫిర్యాదులు కూడా రాలేదన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తాళాలు వెంటే ఉంచుకోవాలని సూచించారు. ఏఎస్పీ పి.శ్రీనివాసరావు, శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద పర్యవేక్షణలో ఈ కేసును ఛేదించిన జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం, శ్రీకాకుళం సీఐ పైడపునాయుడు, ఎస్సైలు సందీప్‌కుమార్, లక్ష్మణరావు, చిరంజీవి, మధుసూదన్‌రావుతో పాటు ఏఎస్‌ఐ వి.రమణ, హెచ్‌సీ తారకేశ్వరరావు, కేకే సింగ్, పీసీలు శ్రీనివాసరావు, దివాకర్‌రావు, శేఖర్, గణేష్, జోగారావు, లక్ష్మణరావు, రమణ, సూరిబాబు, గొల్లారావు, ప్రసాద్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. క్యాష్ రివార్డులు అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ కె.వి.రమణ డీఎస్పీ వివేకానంద, సీఐలు అవతారం, పైడపునాయుడు, ఇమ్మాన్యుయేల్ రాజు పాల్గొన్నారు.

దాడితల్లి కాలనీలో రెండిళ్లలో చోరీ

- బంగారు, వెండి ఆభరణాల అపహరణ

బొబ్బిలి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని గొల్లపల్లి దాడితల్లి కాలనీలో రెండిళ్లల్లో చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. దాడితల్లి కాలనీలో నివాసం ఉంటున్న మరిశర్ల సింహాచలం అనే ఉపాధ్యాయుడు సంక్రాంతి పండుగకు కుటుంబంతో కలిసి స్వగ్రామం వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించిన దొంగలు ఇంటి కిటికీకి గల ఐరన్ గ్రిల్స్ తొలగించి ఇంట్లోనికి చొరబడ్డారు. ఇంట్లో గల కిలో వెండి, తులంన్నర బంగారు ఆభరణాలను అపహరించుకు పోయారు. శుక్రవారం రాత్రి ఊరు నుంచి తిరిగొచ్చిన కుటుంబ సభ్యులు ఆభరణాలు అదృశ్యం అవడాన్ని గుర్తించారు. శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ● అదే కాలనీకి చెందిన గొట్టాపు వేణు అనే రాజా కళాశాల అధ్యాపకుని ఇంట్లో చొరబడి 350 గ్రాముల వెండి, పావు తులం బంగారు ఆభరణాలను అపహరించుకుపోయినట్లు శనివారం ఫిర్యాదు అందిందని ఏఎస్‌ఐ బీవీ రమణ తెలిపారు. కేసు నమో దు చేసి, దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. విజయనగరం నుంచి క్లూస్‌టీం వచ్చి ఆధారాలు సేకరించిందని, నింది తుల కోసం గాలింపు చే స్తున్నామని, నిఘా పెట్టామని, త్వరలోనే పట్టు కుంటామని ఆయన తెలిపారు.

ఘనంగా ముత్యాలమ్మ తీర్థం


తీర్థంలో భక్తుల కోలాహలం

వేపాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దబ్బిరాజుపేట గ్రామ ప్రజల ఆరాధ్య దేవత ముత్యాలమ్మ తీర్థ మహోత్సవం శనివారం వైభవోపేతంగా జరిగింది. గ్రామస్తులతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కోన వెంకటేష్, జొన్నపల్లి శ్రీను, కోన సత్యనారాయణ, గ్రామ పెద్ద చామంతుల గంగాధర్, కోన సత్యారావు, జొన్నపల్లి రమణ, ఏడువాక దేముడు, ఏడువాక కృష్ణస్వామినాయుడు, సర్పంచ్ దండుపాటి ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను వినియోగించుకోండి

తెర్లాం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రీ సర్వేను రైతులు వినియోగించుకోవాలని ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు కోరారు. పణుకువలస గ్రామంలో ఆయన శనివారం పర్యటించారు. రీ సర్వేపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. పణుకువలసను పైలట్ గ్రామంగా ఎంపిక చేశామని చెప్పారు. తమ సచివాలయ పరిధిలో ఉన్న వీఆర్వో, సర్వేయర్‌ను సంప్రదించి రికార్డుల్లో తప్పులు లేకుండా సవరించుకోవాలన్నారు. తహసీల్దార్ హేమంత్ కుమార్, డీటీ సత్యనారాయణ పాల్గొన్నారు.